డీఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐ

డోర్నకల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

డోర్నకల్, డిసెంబర్ 21: డోర్నకల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం డీఎస్పీ సత్యనారాయణ ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత సీఐ ఉపేందర్‌రావు స్టేషన్ ఆవరణలో డీఎస్పీ సత్య నారాయణకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోలీస్ స్టేషన్‌లోని విభాగాల రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రేట్, పెండింగ్ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సైలు ఝాన్సీ, సంతోష్ రావు, ఏఎస్సై కోటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ సైదులు, కోటేశ్వరరావు, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

వరి సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

దంతాలపల్లి, డిసెంబర్ 21: చలి తీవ్రత అధికంగా ఉండడం వల్ల రైతులు వరి సాగులో జాగ్రతలు తీసుకోవాలని ఏడీఏ శోభన్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని గున్నెపల్లి గ్రామ శివారులో నారుమళ్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. చలితీవ్రత నుంచి నారుమళ్లను కాపాడుకునేందుకు సూచనలు ఇచ్చారు. ఏతావో దీక్షిత్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలిస్తున్న శోభన్‌బాబు

మామిడి రైతులు తోటలో సరైన సమయంలో జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడితో పాటు అధిక ఆదాయం పొందవచ్చు. తెలంగాణ మామిడి కాయలకు విదేశాల్లో మంచి గిరాకీ ఉంటోంది. ఇక్కడి నుంచి బంగినపల్లి రకం ఎక్కువ శాతం ఎగుమతి అవుతుంది. సలహాలు, సూచనలు పాటిస్తూ, రైతులు తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు.

మామిడి.. మంచి దిగుబడి

కొమ్ములవంచలో ఉన్న మామిడి తోట

- పూత, పిందె సమయంలో జాగ్రతలు తప్పనిసరి
- సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక లాభాలు
- సలహాలు, సూచనలు పాటించాలంటున్న ఉద్యాన శాఖ అధి కారులు

నర్సింహులపేట, డిసెంబర్ 21: జిల్లా వ్యాప్తంగా 16వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా మహబూబాబాద్, కురవి, దంతాలపల్లి, మరిపెడ, తొర్రూరు మండలాల్లో మామిడి సాగు చేపట్టారు. పూత దశలో చీడపీడల నివారణకు వేర్వేరుగా మందులు పిచికారీ చేయడం ఖర్చు, శ్రమతో కూడిన పని. కాబట్టి ఒకటి లేదా రెండు సార్లు మన తోటల పరిస్థితిని బట్టి పిచికారీ చేస్తే సరిపోతుందని ఉద్యానశాఖ అధికారి రాకేశ్ తెలిపారు. పూత పూర్తిగా విచ్చుకున్న తర్వాత తెల్ల పూత దశలో ఎలాంటి మందులు పిచికారీ చేయవద్దు. పరాగ సంపర్కంగా అయిన తర్వాత చిన్న పిందెలు ఏర్పడే ముందు ఈ దశలో తేనేమంచు పురుగు కానీ, బూడిద తెగులు, పక్షికన్ను తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు చెట్టు తడిసే విధంగా మందులు పిచికారీ చేస్తే దిగుబడి పెరిగే అవకాశం ఉన్నదని తెలిపారు.

పూత దశలో..

మామిడి చెట్టుకు పూత దశలో రైతులు విచ్చలవిడిగా మందులు పిచికారీ చేయకుండా ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్, కార్బడిజమ్ మరియు మాంకోజెబ్ 2 గ్రాములు మరియు 0.5 గ్రాములు శాండోవిట్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

బూడిద తెగులు వచ్చిన మామిడి తోట

పిందె దశలో జాగ్రత్తలు తప్పనిసరి

వర్షాధారం మెట్టసాగులో ఉన్న మామిడి తోటలో పిందె రాలకుండా ఉండేందుకు రైతులు లీటర్ నీటికి 19-19-19 సూక్ష్మపోషకాలు 3 గ్రాములు, 0.25 ఎంఎల్ ప్లానోఫిక్స్ కలిపి పిచికారీ చేయాలి. 20 రోజుల వ్యవధిలో 5 గ్రాముల 13-0-45 మరియు యూరియా 5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. పిందె బఠాణి గింజ సైజులో ఉన్నప్పుడు, బాధంకాయ , నిమ్మకాయ సైజులకు వచ్చిన సమయంలో నీటి తడులు అందించాలి. మామిడి కాయ గోళి సైజు వచ్చిన సమయంలో చెట్టుకు అరకిలో యూరియా, కిలో పోటాష్ వేసి నీరు అందించాలి. దీంతో కాయ సైజు పెద్దగా కావడంతోపాటు పిందె రాలిపోకుండా ఉంటుంది. బిందు సేద్యం సదుపాయం ఉన్న రైతులు రోజుకు రెండు లైన్ల డ్రిప్‌లో 3 నుంచి 5 రోజుల వ్యవధిలో 19-19-19 సూక్ష్మ పోషకాలు 3 గ్రాములు, 0.25 ఎంఎల్ ప్లానోఫిక్స్ ఫైర్టిలైజర్ ట్యాంకులో మందులు కలిపితే సూక్ష్మ వాతావరణం చల్లబడి పిందె రాలడం తగ్గుతుంది.

- సీహెచ్ రాకేశ్, ఉద్యన శాఖ అధికారి, తొర్రూరు డివిజన్

గిరిజన హాస్టల్ స్థలానికి హద్దులు నిర్ణయించాలి

కేసముద్రం, డిసెంబర్ 21: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలకు వెంటనే హద్దులు నిర్ణయించాలని కోరుతూ పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ బొట్టు రమేశ్ తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ శ్రావణ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం గిరిజన పాఠశాలకు 4 ఎకరాల 10 గుంటల స్థలం కేటాయించిందని, హద్దులు లేని కారణంగా ఆక్రమణకు గురవుతుందని, వెంటనే హద్దులు ఏర్పాటు చేసి ప్రహారీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో అజ్మీరా బాలు, భూక్యా రవి తదితరులు ఉన్నారు.

గార్ల ఎంపీపీపై అవిశ్వాసం

గార్ల, డిసెంబర్ 21: గార్ల ఎంపీపీ మూడు శివాజీ చౌహాన్‌పై ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం వేశారు. గురువారం ఆర్డీవో అలివేలుకు 8 మంది ఎంపీటీసీలు తీర్మాన పత్రాన్ని అందజేశారు. వారిలో మాలోత్ వెంకట్‌లాల్, కట్టెబోయిన శ్రీనివాస్, బట్టు నాగరాజు, పసుపులేటి సూజాత, మంజూర, రాజాకుమారి, సుగుణాదేవి, పరంగన్ ఉన్నారు.

కేసముద్రం మార్కెట్‌కు 5 రోజులు సెలవులు

కేసముద్రం, డిసెంబర్ 21: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 22 నుంచి 26 వరకు ఐదురోజుల పాటు సెలువులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ సెలవులు, క్రిస్మస్ పండుగ సందర్భంగా మార్కెట్‌కు సెలవులు ప్రకటించామని రైతులు పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకురావద్దని సూచించారు. 27న తిరిగి మార్కెట్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కేసముద్రం, డిసెంబర్ 21: మార్కెట్‌లో పనిచేసే బండి హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మార్కెట్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న మాట్లాడుతూ బండి హమాలీ కార్మికులు, కూలీల ఒప్పందం ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి వేతనాలు పెంచాలన్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి కూలీ రేట్లు పెంచకుంటే పనులను నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు జాటోత్ బిచ్చానాయక్, వెంకన్న, సముద్రాల మల్లయ్య, రమణ, సురేశ్, వీరన్న, లక్ష్మణ్, బిచ్చునాయక్, సామ శ్రీనివాస్ రెడ్డి, బానోత్ కిషన్ పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో ఒకరికి గాయాలు

డోర్నకల్, డిసెంబర్ 21: రైలు ప్రమాదంలో వ్యక్తి కాలుకు తీవ్రగాయాలైన ఘటన డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో గురువారం జరిగింది. జీఆర్‌పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. విశాఖపట్నం ఊపరిగూడానికి చెందిన నర్సింహారావు బుధవారం రాత్రి డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని రైలు కింద అతడి కాలు పడి నుజ్జునుజ్జు అయింది. చార్మినార్ ఎక్స్‌ప్రెస్ లోకోపైలెట్ సమాచారం అందించగా నర్సింహారావును 108 వాహనంలో దవాఖానకు తరలించారు.వివరాలు తెలియాల్సి ఉన్నది.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కురవి, డిసెంబర్ 21: పెద్ద తండాలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సోదరుడు మాజీ సర్పంచ్ గుగులోత్ కిషన్ నాయక్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, గురువారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వినూత్న బోధనతో విప్లవాత్మక మార్పు

మండల నోడల్ ఆఫీసర్ మంగతాయి

నెల్లికుదురు, డిసెంబర్ 21: ఉపాధ్యాయులు తరగతి గదుల్లో వినూత్న పద్ధతిలో బోధిస్తే విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన పెరిగి విప్లవాత్మక మార్పులు వస్తాయని మండల నోడల్ ఆఫీసర్ జే మంగతాయి అన్నారు. మండలంలోని మీట్యాతండా, రేగడితండా, వరంబండతండా ప్రాథమిక పాఠశాలలు, చిన్ననాగారం, కాచికల్, ఎర్రబెల్లిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను, ఎఫ్ఎల్ఎన్ అమలు తీరును పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ అమలు చేయాలని, దీంతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతున్నాయన్నారు. దాన్ని ఆధారంగా చేసుకొని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోనూ ఉన్నతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల బోధనను పరిశీలించేందుకు మండల నోడల్ ఆఫీసర్లతో పాఠశాలల సందర్శన ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారని, సంబంధిత పర్యవేక్షణను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీ బీ కవిత పాల్గొన్నారు.



మీట్యాతండా పాఠశాలలో బోధనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఎన్‌వో మంగతాయి

నూతన ఓటర్లను నమోదు చేసుకోవాలి

ఆర్డీవో నర్సింహారావు

నర్సింహులపేట, డిసెంబర్ 21: వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు నూతన ఓటర్లుగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నర్సింహులపేట, దంతాలపల్లి మండలాల బూత్ లెవల్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరణించిన వారి ఓట్లను తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఆర్ఐ సైదులు, మహ్మద్ నజీముద్దీన్, బూత్ లెవల్ అధికారులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో నర్సింహారావు

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నెల్లికుదురు, డిసెంబర్ 21: మండలంలోని ఎర్రబెల్లిగూడెంలో గురువారం ఎంపీటీసీ అనిల్‌గౌడ్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. మండల పరిషత్ నిధులతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ అశోక్ గౌడ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెల్త్ డైరెక్టర్‌ను కలిసిన డీఎంహెచ్‌వో

మహబూబాబాద్ రూరల్/తొర్రూరు: రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రవీందర్ నాయక్‌ను గురువారం హైదరాబాద్‌లో జిల్లా వైద్యాధికారి అంబరీష మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీధర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జునరావు, శ్రీనివాస్, రుక్ముద్దీన్, సాయికృష్ణ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా..

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 21: జిల్లా కలెక్టరేట్‌లోని ఉపాధి కార్యాలయంలో ఈ నెల 23న ఫీల్డ్ స్టాఫ్, మార్కెటింగ్ సేల్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శశాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ సాయి అగ్రి టెక్నాలజీ సహకారంతో 25 ఫీల్డ్ స్టాఫ్ ఉద్యోగాలున్నాయని, ఇంటర్ పాసైన, ద్విచక్ర వాహనంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. 21 నుంచి 32 సంవత్సరాల వయసు గల వారు అర్హులని, వేతనం రూ. 10 వేలతో పాటు టీఏ, డీఏలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం ఫోన్ నంబర్ 9908768489ను సంప్రదించాలన్నారు.

ప్రజాస్వామ్య ప్రభుతాన్ని కాపాడుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 21: భారత ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కే రవి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన స మావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పాసిస్టు తరహాలో పాలన కొనసాగించడానికి అనేక ప్రయత్నాలు చేస్తుందన్నారు. వీరన్న, సూర్యం, వెంకటేశ్వర్లు, సత్యం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు లక్ష్మీపురం విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 21: తొర్రూరులో ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు వీఎస్ లక్ష్మీపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 4న పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు మధుప్రియ, వైష్ణవి, మౌనిక, వరుణ్, చరణ్‌తేజ్ పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

చింతపల్లి విద్యార్థులు..

కురవి : చింతపల్లి హైస్కూల్ విద్యార్థులు అండర్ -17 విభాగంలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -17 విభాగంలో టీ అరవింద్, బీ దినేశ్, ఎన్ యశ్వంత్, శ్వేత, సామ్యా శ్రీపాల్గొని ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సర్పంచ్, ఎంపీటీసీ విద్యార్థులను అభినందించారు.

కాంపల్లి విద్యార్థుల ఎంపిక

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ సేడియంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు కాంపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 23న కామారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు బీ యశ్వంత్, బీ అరుణ్ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యయామ ఉపాధ్యాయులు జీ రాణి, హెచ్ఎం అరుణ విద్యార్థులను అభినందించారు.

అనాథ వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

తొర్రూరు, డిసెంబర్ 21: బాలవికాస సంస్థ అనాథ వృద్ధులను ఆదుకోవడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని లయన్స్ భవన్‌లో గురువారం వివిధ గ్రామాలకు చెందిన 50 మంది అనాథ వృద్ధులకు బాలవికాస ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఎండీ ఆస్మాబేగం భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల వృద్ధులకు ఆసరా దొరికిందని, కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. దుస్తులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చినట్లు పేర్కొన్నారు. దాతలు శ్రీమాత ఆయిల్ షాప్ యజమాని రేవూరి శ్రీధర్, దేవేందర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేకర్, బాలవికాస సెంటర్ మేనేజర్ యేల్లు రమ, ఎంసీ మద్దెల రమ, జే శైలజ, శోభ, సరిత, రమేశ్, కమిటీ లీడర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై

ప్రిన్సిపాల్ వేధింపులు..

ఇనుగుర్తి, డిసెంబర్ 21: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బీ భాగ్యం తనను మానసికంగా వేధిస్తున్నట్లు పార్ట్‌టైం ఉపాధ్యాయురాలు పీ రాధిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి పాఠశాల బుక్స్, ఎలక్షన్స్‌కు సంబంధించిన మెటీరియల్స్ తీసుకురావాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తీవ్ర ఒత్తిడి చేస్తున్నదన్నారు. నిత్యం 'నువ్వు పార్ట్‌టైం టీచర్‌వి' అని అసభ్యకర పదజాలంతో దూషిస్తున్నదని ఆరోపించింది. పాఠశాలకు సంబంధించిన చెప్పిన పని చేయకపోతే తనను టార్గెట్ చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఉపాధ్యాయురాలు పేర్కొన్నది. ఇటీవల నల్లగొండ జిల్లాలో జరిగిన సైన్స్‌ఫేర్‌కు పాఠశాల నుంచి బాలికలను తీసుకుపోవాల్సి ఉండగా, అంతకు ముందు నుంచే తన కుమారుడికి తీవ్రంగా జ్వరం వచ్చిందని చెప్పినా ప్రిన్సిపాల్ తననే వెళ్లమని ఒత్తిడి చేసిందన్నారు. దీంతో మూడు రోజులపాటు నల్లగొండలో ఉండి వచ్చినప్పటికీ తనను 'నువ్వు పార్ట్‌టైం టీచర్‌వి, దేనికి పనికి రావు' అంటూ అసభ్య పదజాలంతో తోటి ఉపాధ్యాయుల ఎదుట చులకనగా చూస్తున్నదని తెలిపింది. కాగా, ఈ విషయంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాగ్యంను అడుగగా.. తను మహబూబాబాద్ నుంచి పాఠశాల బుక్స్, ఎలక్షన్స్‌కు సంబంధించిన మెటీరియల్స్ తేవాలని చెప్పిన మాట వాస్తవమేనని, కానీ టీచర్‌ను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదని తెలిపింది. కాగా, గతంలోనూ ఇదే పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన విజయలలిత వాచ్‌ఉమెన్‌ను తీవ్ర వేధింపులకు గురిచేయగా, ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో అధికారులు ప్రిన్సిపాల్‌ను వేరే ప్రాంతానికి బదిలీ చేశారు..

సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 21: కొత్తగా సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారు ఈనెల 22 నుంచి స్లాట్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ శశాంక ఒక ప్రకటనలో తెలిపారు. మండలాల వారీ గా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణంలోని ఆరోగ్య కేంద్రాల్లో సంబంధిత వైద్యులతో వైకల్య నిర్ధారణ పరీక్ష చేయించుకొని ఉండాలన్నారు. అనంతరం ఏదైనా మీ సేవ కేంద్రంలో సదరం వైకల్యం అంచనా ధ్రువీకరణ కోసం తేదీలను నిర్ణయించుకొని స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. స్లాట్ కోసం వైకల్య ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకువెళ్లాలని, మీ సేవలో కేవలం రూ.35 మాత్రమే చెల్లించాలని తెలిపారు. తమకు వచ్చిన స్లాట్ ప్రకారం దరఖాస్తు దారు రసీదుతో వైకల్యం ధ్రువీకరణను మెడికల్ రిపోర్ట్ ద్వారా క్యాంపునకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈనెల 27తో 130 మంది సదరం ధ్రువీకరణ పత్రం కాలపరిమితి ముగుస్తుందని, వారందరు రెన్యువల్ చేసుకోవాలన్నారు.

శ్మశానవాటిక పనులు త్వరగా పూర్తి చేయాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 21: మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో చేపట్టిన శ్మశానవాటిక పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం అధికారులతో కలిసి పట్టణంలోని అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రోడ్ల వెంబడి చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిరోజూ చెత్త సేకరణ చేసి డంప్‌కు తరలించాలన్నారు. అనంతరం రోడ్డు, డ్రైనేజీ, వీధి లైట్లు, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్లాన్ ల్యాండ్ మ్యాప్‌ను, సైంటిఫిక్ హౌస్ నంబరింగ్ సిస్టమ్‌ను పరిశీలించి అధికారులకు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఉపేందర్, సర్వే ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

'వికసిత భారత్' యాత్రను జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

తొర్రూరు, డిసెంబర్ 21: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన వారిని సంక్షేమ పథకాల్లో చేర్పించే విధంగా వికసిత భారత్ యాత్ర ప్రారంభం కానున్నదని, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తొర్రూరుశాఖ అధ్యక్షుడు పల్లెకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రజాపాలనను కోరుకుంటున్నారని, ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా పాల న కొనసాగితే పోరుబాట తప్పదని హెచ్చరించారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి అస్తవ్యస్తంగా ఉన్న పాలనను గాడిలో పెట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు, అధికార ప్రతినిధి, 15వ వార్డు కౌన్సిలర్ కే శంకర్, ఎస్సీ మోర్చా మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఏ రవిబాబు, రూరల్ మండల అధ్యక్షుడు బొచ్చు సురేశ్, నాయకులు పీ రాజేశ్, శేఖర్, ఎన్ ఉపేందర్, కే యాకన్న, విజయ్‌కుమార్, వినయ్‌శర్మ, కే నవీన్ పాల్గొన్నారు.

బీసీ విద్యుత్ ఉద్యోగుల

డివిజన్ నూతన కమిటీ

తొర్రూరు, డిసెంబర్ 21: బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలోని చాంబర్‌ఆఫ్ కామర్స్ భవన్‌లో కమిటీని ప్రకటించారు. సంఘం డివిజన్ అధ్యక్షుడిగా సలుగు నర్సయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పీ వంశీ, ఉపాధ్యక్షుడిగా మచ్చ సునీల్, కార్యదర్శిగా బీ మేత్రాం, ఆర్థిక కార్యదర్శిగా తేలిక యాకన్న, కార్యనిర్వాహక కార్యదర్శిగా కే అశోక్, మహిళా ప్రతినిధిగా ఈ ఉమారాణి, డివిజన్ సలహాదారుగా కోటి లింగంను ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి నీలారపు రాజేందర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కే బోజాలు, ఏవో సంతోష్‌కుమార్, మచ్చ ఐలయ్య, ఎం రమేశ్, ఆర్. సత్యనారాయణ, ఎన్ ప్రసాద్, శామకూరి శ్రీనివాస్, దామోదర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కురవి, డిసెంబర్ 21: రాజోలు సర్పంచ్ మస్తాన్ తండ్రి మహబూబ్ అలీ (85) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలీ మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా హనుమకొండ జిల్లా, హనుమకొండ మండలం, గోపాలపూర్ కాపురస్తులగు శ్రీ గంగవరపు రాధిక, భర్త : బాబురావు, నివాసం: గోపాలపూర్, మండలం హనుమకొండ, జిల్లా హనుమకొండ వీరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ మహబూబాబాద్ బ్రాంచీ వారిని ఋణ సదుపాయం పొందుటకు హామీగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తమ రిజిష్టర్ విక్రయ దస్తావేజు నెం. 11673/2021, తేది: 24-08-2021 మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ వారి సమక్షములో రిజిష్టర్ కాబడిన దాని ద్వారా సంక్రమించిన ఆస్తిని హామీగా ప్రతిపాదించగా సదరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ సమ్మతిని తెలిపియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తి విషయమ